తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం అసిఫాబాద్
మహబూబాబాద్
శుక్రవారం
17 అక్టోబర్ 2025
పేజీలు : 08
Follow :

## శిథిలావస్థలో కొప్పూర్
# జీపీ కార్యాలయం

- ప్రాణభయంతో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది
- కొత్త భవనం కోరుతున్న గ్రామస్తులు...




**భీమదేవరపల్లి, అక్టోబర్ 16(జనం సాక్షి) :** భీమదేవరపల్లి మండలంలోని కొప్పూర్ గ్రామపంచాయతీ కార్యాలయం నేటికీ శిథిలావస్థలో కొనసాగుతోంది. 1953లో నిర్మించిన ఈ పాత భవనం కాలక్రమేణా బీటలు పడుతూ కూలిపోతున్న పరిస్థితికి చేరుకుంది. పైకప్పు పెచ్చులు ఊడిపడి ఎప్పుడైనా ప్రమాదం సంభవిస్తుందేమోననే భయంతో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రతీ రోజు కార్యాలయానికి వస్తున్నప్పుడు భయం వేస్తుంది.ఎప్పుడు పైకప్పు కూలుతుందో తెలియదు.వర్షం పడితే లోపలికి నీరు చేరి పత్రాలు కంప్యూటర్లు తడిసి పాడవుతుంటాయి అని పంచాయతీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామ ప్రజలు చెబుతూ సుమారు 70 ఏళ్ల కిందట నిర్మించిన ఈ కార్యాలయం ఇప్పుడు పూర్తిగా ప్రమాదకర స్థితిలో ఉంది. వర్షాకాలంలో నీరు కారిపడుతూ సిబ్బంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే కొత్త పంచాయతీ భవనం నిర్మించాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి అని విజ్ఞప్తి చేశారు.

### స్థలం లేక నిర్మాణం ఆగిపోయిందని మాజీ సర్పంచ్ వివరణ..

మాజీ సర్పంచ్ గద్ద రాజమణి మాట్లాడుతూ కొప్పూరు పంచాయతీ కార్యాలయం దయనీయ స్థితిలో ఉందని ఇప్పటికే మండల సమావేశంలో ప్రస్తావించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.కొత్త భవనం మంజూరు కూడా అయింది.అయితే పంచాయతీకి స్థలం లేకపోవడం వల్ల నిర్మాణం ఆగిపోయింది అని తెలిపారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని వివరం కోరగా పంచాయతీ కార్యదర్శి రత్నకుమారి మాట్లాడుతూ మాజీ సర్పంచ్ గద్ద రాజమణి ఆధ్వర్యంలోని కొత్త భవనం నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. కానీ స్థలం లభించకపోవడంతో పనులు ప్రారంభం మిగతా 6లో..

## జాతరలో భక్తులకు ఎలాంటి
# ఇబ్బందులు రావద్దు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** బుగులోని జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన బుగులోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం జాతర, బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశానికి రెవెన్యూ, పోలీస్, సింగరేణి, వైద్య, ఆర్టీసీ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. శాసన సభ్యులు మాట్లాడుతూ రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలో నవంబర్ 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు జరిగే శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి జాతరకు వేలాదిమంది భక్తులు తరలివస్తారని, అందువల్ల అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తుల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా తాత్కాలిక మరమ్మతులు, రహదారి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. భక్తులు గుట్టపైకి ఎక్కడానికి అనువుగా ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పరకాల, భూపాలపల్లి ఇతర డిపోల నుండి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అత్యవసర వైద్య కేంద్రాలు, 108 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. భక్తులకు సురక్షిత త్రాగునీరు అందించేందుకు ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు.జాతర సమయంలో భక్తుల రద్దీ నియంత్రణకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా ఉంచాలని, అలాగే అటవీ శాఖ తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జాతర నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారిగా చేపట్టాల్సిన పనులపై అంచనా నివేదికలు ఇవ్వాలని సూచించారు. సిసి కెమెరాల మిగతా 6లో..




## పోలీసులు ప్రజల
# మన్ననలు పొందాలి

- కౌటాల సీఐ కార్యాలయం తనిఖీ
- ఎస్పీ కాంతిలాల్ పాటిల్

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 16 (జనం సాక్షి) :** పోలీసులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా, ప్రజల విశ్వాసం పొందుతూ..మన్ననలు పొందినప్పుడే వారికి నిజమైన గుర్తింపు లభిస్తుందని జిల్లా పోలీసు అధికారి కాంతి లాల్ పాటిల్ అన్నారు. గురువారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాటాల మండలంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పోలీసులు గౌరవ వందనం చేశారు. సర్కిల్ పరిధిలో కేసుల నమోదు, పరిష్కారాల తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైమ్, డ్రగ్స్, గంజాయి, అసాంఘిక కార్యక్రమాలను అరికట్టాలని అన్నారు. మహిళల సమస్యల పట్ల జాగ్రత్తగా వ్యవహరించి కేసుల పరిష్కారం కోసం చొరవ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కాంతిలాల్ వెంట కాగజ్ నగర్ డి.ఎస్.పి వహి యుద్దీన్, సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్లు పాల్గొన్నారు.

## విద్యారంగ బలోపేతం దిశగా
# ప్రభుత్వం చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**కోటపల్లి అక్టోబర్ 16 (జనం సాక్షి) :** కోటపల్లి మండలంలోని విద్యారంగ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని కోటపల్లి మండల కేంద్రంలో గల తెలంగాణ సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను మండల తహసిల్దార్ రాఘవేందర్ రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డిలతో కలిసి సందర్శించి కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పాఠశాలలో బాలికల మూత్రశాలలు, విద్యుత్, లైటింగ్, పెయింటింగ్, గదులకు అవసరమైన మరమ్మత్తులు, ఇతర అవసరమైన పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం నూతన మెనూ అమలు చేస్తూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తుందని, ఈ క్రమంలో విద్యార్థులకు సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సూక్ష్మ హరిత ఆహారం మార్కెటింగ్ అభినందనీయం..పిడి విజయలక్ష్మి



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్16,(జనంసాక్షి):** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) సౌజన్యంతో, నిర్మల్ మండల సమా ఖ్య ఆధ్వర్యంలో ధాన్యశ్రీ మహిళా ఉత్పత్తిదారుల సంస్థ రూపొందించిన సూక్ష్మ హరిత ఆహారం (మైక్రోగ్రీన్స్) తయారీ, మార్కెటింగ్ అభినందనీ యంగా సాగుతోందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ని విజయలక్ష్మి పేర్కొన్నారు.సుమారు 1500 మంది మహిళా రైతుల సభ్యత్వంతో ధాన్యశ్రీ సంస్థ, మహిళా రైతులను వ్యాపారవేత్తలుగా ఎదగే దిశగా ప్రోత్సహిస్తోందని వ్యవసాయ ఉత్పత్తులను నాణ్యమైన సేంద్రియ పద్ధతుల్లో విలువ ఆధారిత ఉత్పత్తులుగా తయారుచేసి మార్కెట్ చేయడం ద్వారా సంస్థ మరింత లాభాలు సాధించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఉదయపు నడకలో, సభ్యులకు సూక్ష్మ హరిత ఆహారం ప్రాధా న్యం పై అవగాహన కల్పించారు. ప్రతిరోజు ఆహారంలో మైక్రో గ్రీన్స్‌ను చేర్చ డం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలు, రక్తపోటు నియంత్రణలో ఉండడం, రక్తశు ద్ధి, హిమోగ్లోబిన్ పెరుగుదలతో పాటు శరీరానికి అవసరమైన ఫైబర్, ఆంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా అందుతాయి. మైక్రో గ్రీన్స్ వినియోగం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని డిఆర్డిఓ తెలిపారు. మహిళా రైతులు సేంద్రియ ఉత్పత్తుల ద్వారా ఆర్థికంగా స్వయం సమృద్ధిని సాధిం చడం సంతోషకరమని ఆమె పేర్కొన్నారు.

## దండారి (గుస్సాడి) ఉత్సవాల్లో బలరాం జాదవ్



**నేరడిగొండ అక్టోబర్ 16(జనంసాక్షి):** మండలం మంగల్ మోటా గ్రామం లో దీపావళి పండుగ సందర్భంగా వారం రోజుల పాటు సంప్రదాయ బద్ధంగా దండారి (గుస్సాడి) ఉత్సవాలు నిర్వహిస్తారు.గురువారం రోజున దండారి ఉత్సవానికి గ్రామా ప్రజల ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర ఆధ్యాపకసంఘం ప్రధానకార్యదర్శి బలరాం జాదవ్ పాల్గొన్నారు.బలరాం జాదవ్ మాట్లాడుతు గ్రామస్తులు నిర్వహించే ఈ ఉత్సవాలు భారతదేశంలో పేరు ప్రఖ్యాతులు గడించాయని అంతే కాకుండా అదివాసి బిడ్డలకు ప్రత్యేక గుర్తింపును తెచ్చి పెడుతున్నాయని అన్నారు. మన దేశ సంస్కృతి సాంప్రదాయాలను మనం కాపాడుకోవడం వల్ల ఐక్యత పెరుగుతుందని,ప్రజలు ఆనందదాయకంగా ఉంటారని,మన దేశంలో ఉన్నటువంటి సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచంలో ఎక్కడా లేవని వాటిని మనం కాపాడు కోవాలంటే ఇలాంటి ఆచారాలు పాటించాలని అన్నారు.

## విద్యుత్ షాక్‌తో గుర్తు తెలియని వ్యక్తి మృతి



**నెరడిగొండ అక్టోబర్16(జనంసాక్షి):** మండలం లోని వ్యవసాయ క్షేత్రంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గురువారం రోజున స్థానిక ఎస్ ఈ ఇమ్రాన్ తెలిపిన వివరాల మేరకు నవీన్ రెడ్డి కి చెందిన వ్యవసాయ క్షేత్రం (పొలం)లో నేరడిగొండ మండలం బుడికొండ గ్రామ సమీపంలో సుమారు 45 సంవత్సరాల వయస్సు గల ఒక గుర్తు తెలియని వ్యక్తి విద్యుత్ షాక్‌తో మరణించారు.?మృతుడు తెల్లటి చొక్కా జీన్స్ ప్యాంటు ధరించి,కాళ్ళకు చెప్పులు వేసుకుని ఉన్నాడు.ఇంకను వివరాలు తెలియాల్సి ఉంది.ఈ గుర్తుతెలియని వ్యక్తి వివరాలు తెలిసినవారు ఎవరైనా ఉంటే నేరడిగొండ ఎస్ఐ ఆఫ్ పోలీస్‌కి 8712659947 ఈ నెంబర్‌కు కాల్ చేయగలరని పేర్కొన్నారు.

## తాగు నీటి సమస్య పరిష్కరించాలని కాసిపేట గని ముందు నిరసన

**కాసిపేట అక్టోబర్ 16 (జనంసాక్షి):** కాసిపేట,ముత్యంపల్లి,చిన్న ధర్మారం గ్రామాలలో నీటి సమస్య తీవ్రంగా ఉందని నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని బిజెపి పార్టీ మండల అధ్యక్షులు సూరం సంపత్ కుమార్ డిమాండ్ చేశారు.గురువారం బిజెపి పార్టీ ఆధ్వర్యంలో, గ్రామస్తులు మహిళలతో కలిసి కాసిపేట 1వ గని గేటు ముందు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. సూరం సంపత్ కుమార్ మాట్లాడుతూ, పంచాయతీ కార్యదర్శి కి ఎన్నిసార్లు విన్నవించుకున్నా నిధుల కొరత ఉందని, తెలిపారని, గ్రామాల్లో ఉన్న అధికార పార్టీ నాయకులు కనీసం సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. కాసిపేట, ముత్యంపల్లి, చిన్న ధర్మారం గ్రామాలలో భూగర్భ జలాల్లో నీరు లేక పోవడం వలన బోర్లు పడలేని పరిస్థితి ఉందని, ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని, సింగరేణి అందిస్తున్న నీరు ఫిల్టర్ కాకపోవడం వలన చర్మవ్యాధులు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, తెలిపారు.మంచినీటి సౌకర్యం కల్పించాలని అదనపు మేనేజర్ నిఖిల్ అయ్యర్ కు వినతి పత్రం అందజేశామని సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించి మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో



బిజెపి మండల ఉపాధ్యక్షులు బాకి కిరణ్, నాగరారపు ప్రసన్న, మహిళలు పోసు, లచ్చక్క, కవిత, పద్మ మహేశ్వరి, లక్ష్మి, గ్రామస్తులు బర్ల రామ్మూర్తి, మైదం రవి, సూరం కిషన్, నారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల డిజిటల్ విద్య శిక్షణ కార్యక్రమం ముగింపు



**చెన్నారావుపేట, అక్టోబర్ 16(జనంసాక్షి):** మండలంలోని మగ్దుం పురం గ్రామంలోని జయముఖి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన డిజిటల్ విద్య మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది.ఈ శిక్షణలో ఉపాధ్యాయులకు ఆధునిక డిజిటల్ బోధన పద్ధతులు, ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫార్మ్‌ల వినియోగం, సాంకేతిక విద్యా పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిని బైరి సరళ, చెన్నారావుపేట జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాపమ్మలు పాల్గొని మాట్లాడారు.ఉపాధ్యాయులు డిజిటల్ పద్ధతులను ఆచరణలోకి తీసుకురావడం ద్వారా విద్యార్థులు నేర్చుకునే విధానం మరింత సమర్థవంతమవుతుందన్నారు. అనంతరం కళాశాల జాయింట్ సెక్రటరీ టీవీఆర్ఎన్ రెడ్డి శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులను అభినందిస్తూ భవిష్యత్తు లో విద్య డిజిటల్ రూపంలో ఉండనుందని అందుకు తగిన నైపుణ్యాలు సాధిం చుకోవాలని సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో గీసుకొండ, దుగ్గొండి, నర్సంపేట, చెన్నారావుపేట, పర్వతగి రిలో 6 నుండి 9వ తరగతిలో బోధిం చే స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్, గణిత శాస్త్రం ఉపాధ్యాయలు, ప్రభుత్వ తెలంగాణ రెసిడెన్షియల్ సొసైటీ పాఠశాల, కెజీబివి పాఠశాలల ఉపాధ్యా యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో జయముఖి కళాశాల ట్రేజరర్ శంకర్ రెడ్డి, జయముఖి కళాశాల ప్రిన్సి పాల్ జానకి, అధ్యాపకులు, పాల్గొన్నారు.

## పేద మహిళ చికిత్సకు అండగా అధికారులు

**బెల్లంపల్లి, అక్టోబర్ 16, (జనంసాక్షి):** నెన్నెల మండల కేంద్రానికి చెందిన దుర్గం రాజు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. గుండె ఆపరేషన్ నిమిత్తం చెల్మెడ ఆనందరావు హాస్పిటల్ కరీంనగర్ వెళ్లేందుకు కనీసం దారి ఖర్చులకు కూడా డబ్బులు లేక అందరి సహాయాన్ని ఆర్థించింది. దళిత పేద మహిళ ఆపదను గుర్తించిన కోవిడ్ వాలంటీర్స్ నెన్నెల 7152 రూపాయలు విరాళాలు సేకరించి చికిత్స కోసం అందించారు. గురువారం కాగా పేద దళిత మహిళ చికిత్స కోసం బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్ పది వేల రూపాయల నగదుతో పాటు ఇరవై ఐదు కిలోల సన్న బియ్యం, నెన్నెల ఎస్సై కే ప్రసాద్ అయిదు వేల రూపాయలు, ఎంపీడీఓ అబ్దుల్ హై రెండు వేల రూపాయలు, నెన్నెల పాత్రికేయుల తరపున మూడు వేల రూపాయలు నగదు అందించి ఆదుకున్నారు. సోపతి సభ్యులు సదరు మహిళ చికిత్స కోసం కరీంనగర్ వెళ్లి రక్తదానం చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.



## ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం



**పర్వతగిరి అక్టోబర్ 16 (జనంసాక్షి):** వరంగల్ జిల్లా సంక్షేమ శాఖ సంక్షేమ అధికారి రాజమణి ఆధ్వర్యంలో ,పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి లింగారెడ్డి అధ్యక్షతన అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భ ంగా జెడ్ పిహెచ్ఎస్ ఏనుగల్ గ్రామం పర్వతగిరి మండలంలో జిల్లా మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి నిర్వహించారు ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ బాలికల హక్కులను కాపాడటం వారి ప్రతిభను వెలుగులోకి తేవడం సమాన హక్కులతో కూడిన సమాజాన్ని నిర్మించడం మన అందరి బాధ్యత అని అన్నారు పోషణ చట్టపరమైన హక్కులు వైద్య సంరక్షణ రక్షణ హింస నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించవల సిన అవసరాన్ని వివరించారు డబ్ల్యూ సిడిఎస్‌సి విభాగం సేవలు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించవలసిన టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్‌ల గురించి విద్యార్థులకు 1098 181,100 1930,14567 వివరించారు అలాగే రుతుక్రమ పరిశుభ్రత గురించి బాలికలకు వివరించారు ఈ కార్యక్ర మంలో డిహెచ్ఈడబ్ల్యూ జిఎస్ రమాదేవి ఏ డబ్ల్యూ టి అరుణ ఉపాధ్యాయులు ఆనంద్ కుమార్ ఎండి మజాహర్ వి కేశవులు ఎస్ విజయలక్ష్మి నస్రా లు పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో బాలికల చేత మొక్కలను నాటించడం జరిగింది

## నత్తల నివారణకు చర్యలు చేపట్టాలి

### మండల వ్యవసాయాధికారిణి పుష్పాల సృజన



**బెల్లంపల్లి, అక్టోబర్ 16, (జనంసాక్షి):** నత్తల నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి పుష్పాల సృజన అన్నారు. గురువారం ఆమె బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలంలోని నందులపల్లి గ్రామంలో నత్తల బారిన పడిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులకు నత్తల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా నత్తల నివారణకు మెటల్డ్రెడ్ 2.5. డీపీ కిలోలు మందును ఎకరానికి చేనులో అక్కడక్కడ సాయంత్రం పూటా పెట్టడం వలన నత్తలు తగిలి చనిపోతాయి. లేదా వేడి వాక్కువగా (ఎండ జీవులు) వున్న సమయంలో అవి చల్లని, నీడ ప్రాంతంలో గుంపుగా వుంటాయి ఆసమయంలో వాటిపై ఉప్పు కలిపిన ద్రావణం చల్లాలి. ఈ విధంగా చేయడం వల్ల నత్తల నివారణలు ఆశించిన పలితాలు వుంటాయని అవగాహనా కల్పించారు. ఆమె వెంట ఏఈఓలు షైనీ, రాంచందర్, రైతులు ఉన్నారు.

## జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని తిరుమలగిరి శివారు శ్రీ వెంకటేశ్వర స్వామి బుగులోని జాతర ఏర్పాట్లను గురువారం శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహూల్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, పారిశుధ్యం, రవాణా, పార్కింగ్, విద్యుత్, వైద్య సేవలు తదితర అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతర, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులు వివరాలు తెలియజేశారు. అధికారులు పరస్పర సహకారంతో జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, ఆర్ డబ్ల్యూఎస్ ఈఈ శ్వేత, పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్వేత, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, ఎంపిఓ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసిన పొట్లపల్లి శ్రీధర్ రావు



**స్టేషన్ ఘన్పూర్, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** పలు అభివృద్ధి కార్యక్రమాల విషయమై హనుమకొండ లోని ఎమ్మెల్యే కడియం క్యాంపుకార్యాలయంలో శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ పోట్ల పల్లి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని గురువారం పల్లగుట్ట నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పల్లగుట్ట గ్రామా నికి హెల్త్ సబ్ సెంటర్, ఎస్సీ కమ్యూనిటీ హాల్ విషయంపై చర్చించడం జరిగింది. ఎమ్మెల్యే కూడా ఈ విషయంపై స్పందించి పనులు పున ప్రారంభించాలని తెలుపడం జరిగిందని అన్నారు. అదే విధంగా జీడి ఏలియా(మేస్త్రి) మేన కోడలు దార కృప హార్ట్ సర్జరీ కోసం 2.5 లక్షల ఎల్ ఓ సి మంజూరు చేసి కడియం శ్రీహరి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు దార రాజు, మార్కెట్ డైరెక్టర్ పెరాల సుధాకర్, ఎనగందుల నరసింహ రెడ్డి,మాజీ సర్పంచ్ పిట్టల ఎల్లయ్య, కారోబార్ జీడి ఆనందం, గుర్రపు యాదగిరి, కుంచాల సంపత్ రాజ్,దార అశోక్ పాల్, యువజన నాయకులు ఇసురం కృష్ణ, ఐలపాక మనోజ్ కుమార్,జీడి జైరాజ్ పాల్గొన్నారు.

## మార్నింగ్ వాక్‌లో సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్సీ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి పట్టణంలో మార్నింగ్ వాక్ చేసిన శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని ఆచార్య జయశంకర్ ఉద్యానవనంలో మార్నింగ్ వాకింగ్ చేసిన సందర్భంగా పార్క్ లో సమస్యలను చూసి, స్థానిక సింగరేణి జిఎం కు ఫోన్ చేసి పార్క్ లో సౌకర్యాలు మెరుగు పరచాలని సూచించారు. అనంతరం జయశంకర్ విగ్రహం వద్ద సిరికొండ కాంప్లెక్స్ ఖదిరుల్లా టీ స్టాల్ వద్ద పారిశుధ్య కార్మికులతో కలిసి టీ తాగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.-



# బీసీ సంఘాల బందుకు సిపిఐ మద్దతు

**బెల్లంపల్లి, అక్టోబర్ 16, (జనంసాక్షి):** బీసీ సంఘాలు రేపు తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర వ్యాప్త బందుకు బెల్లంపల్లి సిపిఐ పట్టణ సమితి సంపూర్ణంగా మద్దతు తెలుపుతుందని సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి తెలిపారు. గురువారం బెల్లంపల్లి పట్టణ సిపిఐ కార్యాలయం బాసెట్టి గంగారాం విజ్ఞాన భవన్లో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ రాకుండా రెడ్డి సామాజిక వర్గం బీజేపీ అడ్డుపడటం తగదన్నారు. రెడ్డి సామాజిక వర్గం హైకోర్టులో వేసిన పిటిషన్ వాపస్ తీసుకుని హైకోర్టు స్టేను వెంటనే రద్దు చేయించి బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు నిర్వహించడానికి దోహదపడాలన్నారు. బీసీ సంఘాలు శనివారం తలపెట్టిన తెలంగాణా బంద్ కు బెల్లంపల్లి పట్టణ సిపిఐ పూర్తి మద్దతు తెలుపుతుందన్నారు. పార్లమెంటులో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తున్నట్లుగా చట్టాన్ని చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే విధంగా జీవో9ను తీసుకొచ్చి షెడ్యూల్ను ప్రకటించినా, కేంద్రంలో



అధికారంలో వున్న బీజేపీ ప్రభుత్వం ఆమోదించనందున స్థానిక సంస్థల ఎన్నికలు ఆగిపోయాయని అన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చే విధంగా చట్టం తెచ్చి బీసీలకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కేవలం మతతత్వ రాజకీయాలను అనుసరిస్తూ, అగ్రవర్ణాలకే పెద్ద పీట వేస్తూ, బీసీలను విస్మరిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించినా, కేంద్ర ప్రభుత్వం నిర్వాకం వల్ల ఆగిపోయిందని, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 9వ షెడ్యూల్ ప్రకారం చట్టాన్ని చేసి బీసీలు కూడా ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయ్యే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలను రాజకీయంగా ఎదిగే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీ సంఘాల బందుకు వ్యాపార వర్గాలు, ఆర్టీసీ బస్సులు, బ్యాంకులు, ఆటోలు, సినిమా హాలు అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్, జిల్లా సమితి సభ్యులు రత్నం రాజన్న, మేకల రాజేశం, పట్టణ కార్యవర్గ సభ్యులు బియ్యాల ఉపేందర్, బొంకురి రామచందర్, పులిపాక స్వామి దాస్ పాల్గొన్నారు.

# పేదల డబల్ బెడ్ రూమ్‌లకు పట్టాలి ఇవ్వాలి

- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుణకంటి రాజన్న

**తొర్రూరు , అక్టోబర్ 16 (జనంసాక్షి):** తోరూర్ పట్టణ కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో నివాసం ఉంటున్న పేదలకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుణగంటి రాజన్న డిమాండ్ చేశారు. ఈరోజు తోరూర్ మండల కేంద్రంలో గోపాలగిరి రోడ్డులో గల డబల్ బెడ్ రూమ్ ఇండ్ల దగ్గర లబ్దిదారులైన 280 మంది లబ్ధిదారులతో జరిగిన సమావేశం సిపిఎం పార్టీ తోరూరు ఎండి యాకూబ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజన్న మాట్లాడుతూ, సిపిఎం పార్టీ తోరూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఉంటే అధికారులు ప్రభుత్వం చోద్యం చూస్తా ఉన్నారు తప్ప వారికి పట్టాలిచ్చే పని మాత్రం చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి నిజమైన అర్హులను గుర్తించి పట్టాలు పంపిణీ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా పేద ప్రజలందరూ ఐక్యంగా డబల్ బెడ్ రూమ్ ల పట్టాలు సాధించే వరకు శాంతియుతంగా పోరాడుతారని దానికి రెవెన్యూ, పోలీసు, రాష్ట్ర ప్రభుత్వం



అధికారులు స్పందించి పేదలందరికీ పట్టాలి పిచ్చే అంతవరకు ఈ పోరాటం ఆగదు అని వారు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం అశోక్, డోనక దుర్గయ్య, కొమ్మనబోయిన యాకయ్య, జమ్మల శ్రీను, బోర స్వామి, జితేందర్, ఎండి అమీర్, తిమ్మిడి రవి, నజీర్, శోభ వరలక్ష్మి అరుణ , షమీనా, అమీనా, నాగమణి, శ్రీలత, భవాని, రాదా వసంత గడల సాయిలు, ధర్మయ్య, కృష్ణ, కరుణ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ సెంటర్‌లో పోషణ మాసం ముగింపు కార్యక్రమం

**ములుగు ప్రతినిధి,అక్టోబర్ 16(జనంసాక్షి):** పోషణ మాసం సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ములుగు పరిధిలోని కొడిశలకుంట సెక్టార్ లోని అబ్బాపూర్ అంగన్వాడీ అంగన్వాడీ సెంటర్లో పోషణ మాసం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి టి రవి , ములుగు ప్రాజెక్టు సీడీపీఓ కె శిరీష ముఖ్య అతిధులుగా హాజరైనారు. ఈ సందర్భంగా డిడబ్ల్యూఓ గారు మాట్లాడుతూ పోషణ మాసంలో భాగంగా సెప్టెంబర్ 17 వ తేదీ నుండి అక్టోబర్ -16 వరకు నెలరోజుల పాటు ప్రాజెక్ట్, సెక్టార్ మరియు అంగన్వాడీ కేంద్రాల పరిధిలో వివిధ అవగాహన కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. ఈ నెల రోజుల పాటు పోషకాహారం, ఆరోగ్య కరమైన ఆహారపు అలవాట్లు, పిల్లలకు అనుబంధ పోషకాహారం, ప్రీ స్కూల్ పిల్లలకు ఈసిసిఈ కార్యక్రమాలపై అవగాహన,స్థానిక ఉత్పత్తులు మరియు స్థానికంగా లభించే ఆహార పదార్థలపై అవగాహన, కిషోర బాలికలలో మరియు గర్భిణీ లలో రక్త హీనత పై అవగాహన, ఊబకాయం పై అవగాహన కల్పిస్తూ గ్రామ/పట్టణ స్థాయి లో కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. ఈ సందర్బంగా సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, కిషోర బాలికలు, చిన్న పిల్లలు ప్రోటీన్స్, విటమిన్ల లతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. కిషోర బాలికలకు రక్తహీనత పై అవగాహన కల్పించి ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను సమృద్ధి గా తీసుకోవాలని తెలిపారు, స్త్రీల రుతుక్రమ పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. సరైన పోషక ఆహారము తీసుకోవడం మరియు స్థానికంగా లభించే ఆకుకూరలు పండ్లు కూరగాయలు చిరుధాన్యాలు




చిరుధాన్యాలతో చేసినటువంటి రాగి జావా మిల్లెట్స్ మిల్లెట్స్ తో చేసినటువంటి ఆహారము తీసుకోవాలన్నారు, రుతుక్రమ స మయంలో తగినంత విశ్రాంతి మరియు పోషకాహారము తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం, పిల్లలకు అక్షరాబ్యాసం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో సూపెర్వైసర్లు ఎస్ సరస్వతి, టీ అనంతలక్ష్మి, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ వెంకట్ రాజు, పిజి ప్రాతమ్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు ఉమా దేవి, డిహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది, ఏఎన్ఎంఆశా , అంగన్వాడీ టీచర్లు గర్భిణీ స్త్రీలు, బాలింతలు కిశోర బాలికలు పిల్లలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు ఉపాధి హామీ పథకం అమలు పురోగతి పై సమీక్ష



**వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 16(జనంసాక్షి):** ఇందిరమ్మ ఇండ్లు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ పంచాయతీలలో ట్యాక్స్ కలెక్షన్ , పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ వర్క్స్ పురోగతి పై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష నిర్వహించారు.గురువారం జిల్లా కలెక్టరేట్ లో సమీక్ష సమావేశంలో జడ్పీ సీఈవో ఇందిరమ్మ ఇండ్ల నోడల్ అధికారి రాంరెడ్డి , డిప్యూటీ కమిషనర్ ప్రసన్న, హౌసింగ్ పిడి గణపతి, డిపిఓ కల్పన, పిఆర్ఇఇ ఇజ్జగిరి గార్లు పాల్గొని సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిర్ణీత గడువులోపు ఇండ్లను పూర్తి చేయాలని పేర్కొన్నారు. జిల్లా లో మొత్తం 9457 కు గాను ఇప్పటివరకు 4941 గ్రౌండింగ్ కాగా ఇంకనూ4516 పెండింగ్ లో ఉన్న ఇండ్లకు స్వయం సహాయక గ్రూపులలో రుణాలు ఇప్పించి వారిని ప్రోత్సహించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎం జి ఎన్ఆర్ఇ జిఎస్ లో పనిదినాలు కల్పించుటకు జాబ్ కార్డులు అందించాలని అన్నారు.
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఆలస్యం అవుతున్న మండలాలను ఫీల్డ్ క్షేత్ర స్థాయి లో పర్యటించి అందుకు పనులు పురోగతి పెంచాలని సంబందిత అధికారులను ఆదేశించారు. లబ్దిదారులకు స్టేజ్ ల వారిగా అందవలసిన నిధుల సకాలం లో అందేలా చూడాలని అన్నారు సిమెంట్, ఇసుక, ఇటుక తదితర సామగ్రి సరఫరా కు ప్రభుత్వం నిర్ణయించిన ధరలు చెల్లించే లా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి మండలంలో పెండింగ్ జాబితాను సిద్ధం చేసి అక్టోబర్ 31 వరకు జిల్లా టార్గెట్ పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారిని ఆదేశించారు.ఈ సందర్భంగ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పథకం పై గ్రామస్థాయిలో ఉపాధి అవకాశాలను పెంచే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని,జల శక్తి అభియాన్ జల్ సంచాయి జన్ భాగిదారి లో భాగంగా నీటి సంరక్షణ, నీటి నిలువ, చెక్ డ్యాం, చిన్న ఊట కుంటలు, నీటి నిలువ కందకాలు, రైతుల పొలాలలో సేద్యపు కుంటలు, చెరువుల పునరుద్ధరణ, రోడ్డు మరమ్మత్తులు, టాయిలెట్స్ నిర్మాణం, సి ఆర్ డి వర్క్ యాక్షన్ ప్లాంట్ లో పశువుల పాక, గొర్ల/ మేకల షెడ్లు, కోళ్ల పాక, అజోలా, వర్మి/ నాడెప్ కంపోస్టు పిట్ మొదలైన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పథకం కింద చేపట్టే పనులు స్థానిక అవసరాలకు అనుగుణంగా, శాశ్వత ప్రయోజనాలను అందించేలా ఉండాలని సూచించారు.నూతన అభిరుద్ధి వంటి శాశ్వత ప్రయోజనకర పనులను చేపట్టాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, వృక్షారోపణ, చెరువుల పునరుద్ధరణ, రోడ్డు మరమ్మత్తులు, పంచాయతీ స్థాయిలో గ్రామాల శుభ్రతా పరిశుభ్రత కార్యక్రమాలు వంటి సృజనాత్మక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ గారు సూచించారు. కార్మికులకు సమయానికి వేతనాలు చెల్లించడంతో పాటు పనుల నాణ్యతను నిర్ధారించాలన్నారు. ప్రతి మండలంలో అమలవుతున్న పనులపై మానిటరింగ్ కమిటీల ద్వారా క్రమం తప్పని సమీక్షలు జరపాలని ఆదేశించారు. ఈజీఎస్ పనులలో టాయిలెట్ నిర్మాణానికి ప్రభుత్వ పాఠశాలల లో అవసరం ఉన్నచోట నిర్మించుటకు ప్రతిపాదనలు పంపించాలని జిల్లా విద్యా శాఖ అధికారి కి పలు సూచనలు చేశారు. జల శక్తి అభియాన్ పై ఎక్కువ ఫోకస్ పెట్టి గ్రామీణ ప్రాంతాలలో "ప్రధాన మంత్రి ఆవాస్ యోజన %-% గ్రామీణ" లలో డ్రైనేజీ వ్యవస్థ మరియు ఇంకుడు గుంతల నిర్మాణం సృజనాత్మకతను ఉపయోగించి ఏర్పాటు చేయుటకు ఇంజనీరింగ్ అధికారులు కొత్త ధనాన్ని సంతరించేలా గ్రామీణ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ఎంపీడీవోలు ఎంపీవోలు హౌసింగ్ ఏఈలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ చేయూత




**నూగూర్ వెంకటాపురం అక్టోబర్ 16(జనం సాక్షి):**-ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోకాఫేడు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మారుమూల గ్రామ ప్రాంతంలో వరద బాధితులకు కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ నిత్యవసర సరుకులు,350 కుటుంబాలకు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెంకటాపురం మండల తాసిల్దార్ వేణుగోపాల్, మండల పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ ముత్యం రమేష్,హాజరైనారు.మండల తాసిల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ చేసే సేవలను పేద బడుగు బలహీన వర్గాలకు ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్న అని అన్నారు.కాఫేడ్ స్వచ్ఛంద సంస్థను ఇక ఎన్నో సేవలు అందించాలని కోరారు.అనంతరం సమావేశాన్ని ఉద్దేశించి సర్కిల్ ఇన్స్పెక్టర్ ముత్యం రమేష్ మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతంలో ప్రజలకు అనేక విధాలుగా సహాకారాలు అందిస్తున్న కాఫేడ్ సంస్థకు అభినందనలు తెలిపారు. సొసైటీ చైర్మన్ చిడం మోహన్ రావు మాట్లాడుతూ కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ 2002సంవత్సరంలో ప్రారంభించారని అన్నారు. ఏజెన్సీ ఏరియాలో ఉపయోగపడే వివిధ పథకాలు అభివృద్ధి పనులను చేయడం జరుగుతుందని కొనియాడినారు.అలాగే బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప రాంబాబు మాట్లాడుతూ కాఫేడ్ సంస్థ మొట్టమొదటిసారిగా గ్రామంలోని పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి మహిళలకు వాళ్ల సంతకాలు పెట్టే విధంగా నేర్పించడం జరిగిందనీ అన్నారు.అలాగే గ్రామంలోని బడి మానేసిన పిల్లలను పాఠశాలలో చేర్పించే విధంగా కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ సేవలు చేయడం జరిగిందనీ తెలిపారు. ఈసేవలు అందిస్తున్న కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లూర్థు రాజు ని అభినందించినారు. కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ ఇలాంటి ఎన్నో సేవలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం మండల కోఆర్డినేటర్ గొంది కామేష్, గొంది హనుమంత్. వెంకటాపురం వాజేడు మండల యానిమేటర్స్ ప్రశాంత్,నరేష్ ,ప్రసాద్,ఇందిరా, వెంకటాపురం మండల టిఆర్ఎస్ నాయకుడు గుడపర్తి నరసింహా మూర్తి , మురళి కాంగ్రెస్ నాయకుడు,ఫాధర్ ఇనరెడ్డి, పాల్గొన్నారు.

## బీసీ సమాజం ఇచ్చిన పిలుపుమేరకుఈ నెల 18న బందు విజయవంతం చేయాలి



**గణపురం, అక్టోబర్ 16 (జనం సాక్షి):**బీసీ రిజర్వేషన్లను పెంచాలని దశాబ్దాలుగా మనం పోరాటం చేయటం మూలంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను పెంచుతూ జీవో నెంబర్ విడుదల చేయడం జరిగిందనిఅన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పెంపును వ్యతిరేకిస్తూ రెడ్డి జాగృతికి చెందిన నేతలు మన రిజర్వేషన్లను కోర్టులో కేసులు వేసి అడ్డుకుంటున్నారు మనల్ని అడుగడుగునా అవమానిస్తున్నారు. 5% లేనటువంటి వాళ్లు 60% ఉన్న బీసీలను రాజకీయంగా అణచియాలని చూస్తున్నారని అన్నారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాల్సిన పార్టీలు బీసీల పట్ల చిన్నచూపు చూపుతూ తమాషా చేస్తున్నారు. ఇలాంటి కీలక సమయంలో మన బీసీల భవిష్యత్తు కోసం మన జాతి ఆత్మగౌరవం కోసం హైకోర్టు తీర్పును నిరసిస్తూ అలాగే బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణలు కల్పించాలని ప్రధాన డిమాండ్లతో బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు ఈనెల అక్టోబర్ 18 తేదీన తెలంగాణ రాష్ట్ర బంద్కు పిలుపునివ్వడం జరిగింది. ఈ బంద్ రేపటి మన బిడ్డల భవిష్యత్తు కోసమే మన ఆత్మ గౌరవాన్ని చాటడానికి మన బీసీల ఐక్యతను మరొకసారి రుజువు చేస్తూ రేపటి నుండి 18న నిర్వహించే రాష్ట్ర బంద్ వరకు జరుగు కార్యక్రమాలన్నిటిని విజయవంతం చేయాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## కూచిపూడి పోటీలలో లిటిల్ ఫ్లవర్ విద్యార్థినికి ప్రథమ స్థానం



**తొర్రూరు , అక్టోబర్ 17 (జనం సాక్షి)** జాతీయస్థాయి కూచిపూడి పోటీలలో లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బానోత్ నివేదిత ప్రథమ స్థానం సాధించిందని పాఠశాల కరస్పాండెంట్ అనుమాండ్ల దేవేందర్ రెడ్డి అన్నారు.గురువారం పాఠశాలలో ప్రిన్సిపల్ నాగేశ్వరరావుతో కలిసి విద్యార్థినికి శాలువులతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాన్సన్ పబ్లికే షన్ ఆధ్వర్యంలో ఈనెల 12న రవీంద్ర భారతిలో నిర్వహించిన పోటీలలో తమ పాఠశాల విద్యార్థిని నివేదిత బహుమతి సాధించిందన్నారు. ఈ బహుమతిని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. నివేదితను ప్రోత్సహించి జాతీయ,రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బీసీ జేఏసీ జిల్లా కమిటి ఎన్నిక



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీసీ జేఏసీ నూతన కమిటిని గురువారం ఎన్నుకున్నారు. జిల్లాకేంద్రంలో జరిగిన ఈ ఎన్నికల్లో బీసీ జేఏసీ జిల్లా ఛైర్మెన్ గా పైడిపెల్లి రమేష్, వర్కింగ్ ఛైర్మెన్ గా గట్ల రాజన్న, కన్వీనర్లు గా అందే భాస్కరా చారి, జోగు బుచ్చన్న, కో కన్వీనర్లు గా బర్ల గట్టయ్య, క్యాతారాజు సాంబమూర్తి, గుమ్మడి ప్రదీప్, మేకల సంపత్, అమృత అశోక్, నలిగేటి సతీష్, పోతర్ల మల్లికార్జున్, కో ఆర్డినేటర్ గా శేఖర్ నాని, మహిళా కమిటీచైర్మెన్ గా మేకల రజిత, వర్కింగ్ చైర్మెన్ గా జె.పద్మ, కన్వీనర్ గా బి.పద్మలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన జేఏసి నాయకులు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా బీసీ నాయకులు అందరు ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల సాధనకై ఈ నెల 18న నిర్వహించే బంద్ కు అన్నివర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

### న్యాయమైన పోరాటానికి సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ మద్దతు

### రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా



**పాలకుర్తి, అక్టోబర్ 16 (జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా డిమాండ్ చేశారు.గురువారం పాలకుర్తిలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల సాంబయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమేష్ రాజా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కుల గణన నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినప్పటికీ. కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలుపకపోవడం ద్రోహమైన చర్యగా అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం బిల్లులను ఆమోదించకపోవడం వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. 42 శాతం పై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో రాష్ట్రంలో రిజర్వేషన్ అమలుకై ఉద్యమాలు వస్తున్నాయని, వాటికి సంపూర్ణ మద్దతు తమ పార్టీ తెలియజేస్తుందని ప్రకటించారు. బీసీల రిజర్వేషన్ పై పాలకవర్గ పార్టీలకు చిత్తశుద్ధి లేదని తీవ్రంగా విమర్శించారు. బిసి రిజర్వేషన్లు 42 శాతం అమలుపై రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని, పార్లమెంట్లో చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 18న చేపట్టిన రాష్ట్ర బంద్ కు సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ మద్దతు తెలియజేస్తుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు అనంతోజు రజిత, జీడి సోమయ్య, మండల కార్యదర్శి కొనకటి కలింగరాజు, నాయకులు తూర్పాటి సారయ్య, గాదేపాక బాబు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల రిజర్వేషన్ల కోసం కలిసికట్టుగా పోరాడాలి

**నల్లబెల్లి, అక్టోబర్ 16(జనంసాక్షి):** రాజకీయాలకతీతంగా బీసీల రిజర్వేషన్ల కోసం బీసీలంతా కలిసికట్టుగా పోరాడాలని బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. బీసీల రిజర్వేషన్ల చట్టాన్ని ఆమోదించకుండా కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సిపిఐ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకుల పిలుపుమేరకు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బీసీ హక్కుల సాధన సమితి మండల నాయకుల ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ రేవంత్ సర్కార్ ప్రవేశపెట్టిన 42% బీసీ రిజర్వేషన్లను అన్ని రాజకీయ పార్టీల శాసనసభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించి గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తే ఇప్పటివరకు బీసీ బిల్లును తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చకుండా బీసీ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాడని ఆరోపించారు. ఈనెల 18న బీసీ జేఏసీ నిర్వహించనున్న రాష్ట్ర బంద్ కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ఈ బంద్ కు వ్యాపార వాణిజ్యాల వర్గాలు, ఉద్యోగులు, మేధావులు, యువకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రాస్తా రోకోలో బీసీ హక్కుల సాధన సమితి మండల నాయకులు చీకటి ప్రకాష్, మేడిపల్లి రాజు గౌడ్, జక్కుల కార్తీక్, దిండు భరత్, ఎండి సద్దాం, బూస కుమారస్వామి, రాజన్న, సంపత్, హరీష్ పాల్గొన్నారు.



# శిథిలావస్థలో కొప్పూర్ జీపీ కార్యాలయం



కాలేదు. స్థలం కేటాయించగానే నిర్మాణం ప్రారంభిస్తాం అని తెలిపారు.గ్రామ పంచాయతీ భవనం విషయంపై ఏఈ వినయ్ రెడ్డిని వివరం కోరగా పంచాయతీరాజ్ శాఖ ఏఈ వినయ్ రెడ్డి మాట్లాడుతూ కొప్పూరు పంచాయతీకి కొత్త భవనం మంజూరు చేయడం నిజమే. అయితే స్థలం లేనందున ఫైల్ రద్దయింది.ఇప్పటికైనా స్థలం చూపిస్తే భవనం మళ్లీ మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటాం అని స్పష్టం చేశారు.

**సురక్షిత వాతావరణం కావాలి గ్రామస్థుల విజ్ఞప్తి..**

గ్రామ ప్రజలు సిబ్బంది కలిసి ప్రభుత్వాన్ని కోరుతూ ప్రాణభయంతో పనిచేస్తున్న సిబ్బందికి సేవల కోసం వచ్చే ప్రజలకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు కొత్త పంచాయతీ కార్యాలయం నిర్మాణం త్వరితగతిన చేపట్టాలి అని విజ్ఞప్తి చేశారు. శిథిలావస్థలో ఉన్న కొప్పూర్ గ్రామపంచాయతీ కార్యాలయం భవనం. పైకప్పు పెచ్చులు ఊడిపడటంతో భయాందోళనలో సిబ్బంది.

## జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రావద్దు

ద్వారా బందోబస్తు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పీ కిరణ్ ఖరే, అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సింగరేణి జీఎం రాజేశ్వర రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఆర్టీసీ డిఎం ఇందు, డివిజనల్ పంచాయతి అధికారి మల్లికార్జున్ రెడ్డి, దేవస్థానం చైర్మన్ రమణా రెడ్డి, దేవస్థానం ఈఓ బిల్ల శ్రీనివాస్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోషణ లోపం లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

**చిట్యాల అక్టోబర్ 16 (జనంసాక్షి)** పోషణ లోపం లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలని అంగన్వాడి సూపర్వైజర్ జయప్రద, హై స్కూల్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఊర్మిళా రెడ్డి, పాముకుంట్ల తిరుపతయ్య అన్నారు. గురువారం మండలంలోని నైన్పాక గ్రామంలో పోషకార మాసోత్సవాల ముగింపు కార్యక్రమం అంగన్వాడీ టీచర్స్ సుజాత, సుభద్ర, కరుణ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆరుగురు గర్భవతులకు శ్రీమంతాలు, ముగ్గురు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు.

## కానిస్టేబుల్ నిశ్చితార్థానికి హాజరైన సీపీ సన్ ప్రీత్ సింగ్

**పాలకుర్తి, అక్టోబర్ 16(జనంసాక్షి)** మండలంలోని తిర్మలగిరి గ్రామానికి చెందిన ఉప్పునూతుల లక్ష్మీ- మల్లయ్య దంపతుల కూతురు సౌమ్య, సీపీ కార్యాయలంలో ఏఆర్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తుండగా, గురువారం సౌమ్య, వెలిశాల వెంకటేష్ నిశ్చితార్థానికి వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ దంపతులు గురువారం హాజరై ఆశీర్వదించారు. సౌమ్యకు సీపీ సన్ ప్రీత్ సింగ్ దంపతులు నూతన దుస్తులు అందచేశారు. ఆయన వెంట డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ నర్సయ్య, పాలకుర్తి, స్టేషన్ ఘన్పూర్ సీఐలు జానకిరాంరెడ్డి, వేణు, ఎస్సై లింగారెడ్డి ఉన్నారు.



# బీసీలు తలపెట్టిన బందును విజయవంతం చేయాలి

- **బీసీ సంఘాల ఐక్యవేదిక టేకుమట్ల మండల గౌరవ అధ్యక్షులు నేరెళ్ల రామకృష్ణ గౌడ్**

**టేకుమట్ల అక్టోబర్ 16 (జనంసాక్షి) :** బీసీలకు తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేసి, విద్యా, ఉద్యోగం రాజకీయపరంగా బీసీలకు అవకాశం కల్పించాలని కోరుతూ, బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బంధు కార్యక్రమాన్ని బీసీలు అందరూ కలిసి పాల్గొని విజయవంతం చేయాలనీ బీసీ సంఘాల ఐక్యవేదిక టేకుమట్ల మండల గౌరవ అధ్యక్షుడు నేరెళ్ల రామకృష్ణ గౌడ్, పలువురు బీసీ నేతలు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన బంధు సందర్భంగా టేకుమట్ల మండలంలోని వర్తక, వ్యాపార, వాణిజ్యం దుకాణాల బందుకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. అందుకు అందరూ సహకరించి ఒక్కరోజు బందును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీలు మేలుకొని ఉద్యమిస్తేనే మన హక్కులు సాధించుకుంటామని అందుకు ప్రతి ఒక్క బీసీ రోడ్డుపైకి వచ్చి తమ నిరసన తెలిపి మద్దతు పలకాలని సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో వర్తక వ్యాపార సంఘం మండల అధ్యక్షుడు బొడ్డు సదానందం, విశ్వకర్మ సంఘ మండల అధ్యక్షుడు ఆకోజు వరదాచారి, కుమ్మరి సంఘం గౌరవాధ్యక్షుడు నాంపల్లి వీరేశం, నాయకులు యాదవ సంఘం నాయకులు అబ్బేంగుల రాజయ్య, పలు కుల సంఘాల దర్జీ, ముదిరాజ్, రజక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకోవాలి

- **నర్సంపేట ఐసిడిఎస్ సిడిపిఓ మధురిమ**

**చెన్నారావుపేట, అక్టోబర్ 16(జనం సాక్షి):** ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకోవాలని నర్సంపేట ఐసిడిఎస్ సిడిపిఓ మధురిమ అన్నారు. పోషణ మాసం సందర్భంగా ఐసిడిఎస్ నర్సంపేట పరిధిలోని చెన్నారావుపేట, తిమ్మరాయనపాడ్ సెక్టార్ సూపర్వైజర్లు రాధ, పారిజాతంల ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని చెన్నారావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మధురిమ, డాక్టర్ సరోజ లు పాల్గొని మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నపిల్లలు ప్రోటీన్స్, విటమిన్లతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. కిశోర బాలికలు రక్తహీనత లేకుండా ఐరన్ అధికంగా ఉండే ఆహారపదార్థాలను సమృద్ధిగా తీసుకోవాలని తెలిపారు. స్త్రీల రుతుక్రమ పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. సరైన పోషణకాహారం



తీసుకోవడం ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలతో చేసినటువంటి రాగి జావ, మిల్లెట్స్ తో చేసినటువంటి ఆహారాలు అధికంగా తీసుకోవాలని కోరారు. అనంతరం వెల్ బేబీ షో నిర్వహించి పిల్లలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పోషణ అభియాన్ కోఆర్డినేటర్స్ శ్రీలత, అనిత, ఐకెపి సభ్యులు, అంగన్వాడీ టీచర్లు,తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగనివ్వం

**బచ్చన్నపేట, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** వడ్ల కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలగనివ్వమని చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల నాగుల శ్వేతా వెంకన్న అన్నారు. గురువారం బచ్చన్నపేట మండలంలోని పలు గ్రామాలలో ఐకేపి సెంటర్లతో పాటు పిఏసీఎస్ సెంటర్లను కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని వరి కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా కొనుగోలు జరపాలని రైతులను ఎవరైనా ఇబ్బందులు పెడితే వెంటనే సమాచారం ఇవ్వాలని ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేదే లేదన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద తూకాలు తేమ శాతం కొలిచే పరికరాలు సక్రమంగా పని చేయని యెడల నాణ్యమైన పరికరాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన



ధ్యేయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి రైతు కష్టం ఫలించేలా చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జి బండకింది హరిబాబు. జంగిటివిద్యనాథ్. ఎండి మసూద్. ఆముదాల మల్లారెడ్డి. జిల్లెల్ల దయాకర్ రెడ్డి. అల్వాల ఎల్లయ్య. మద్దికుంట రాధా అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు

## బ్యాంక్ లావాదేవీల పై అవగాహన కలిగి ఉండాలి..

**పాపయ్యపేట పంచాయతీ కార్యదర్శి రాజు..**



**చెన్నారావుపేట, అక్టోబర్ 16 (జనం సాక్షి):** మండలంలోని పాపయ్యపేట గ్రామంలో ధరణి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కల్లెపు శోభారాణి ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా సహకారంతో స్థానిక స్వయం సహాయక సంఘాల మహిళలకు, వ్యాపారులకు, యువకులకు, విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత పైన అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు, వరంగల్ జిల్లా ఎఫ్ఎల్ సి కోఆర్డినేటర్ భాస్కర చారి, సైబర్ క్రైమ్ రిసోర్స్ పర్సన్ రమేష్ లు హాజరయ్యారు. యువకులు, విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలు సైబర్ నేరగాళ్ళ వలలో పడి బారిమొత్తంలో డబ్బులు నష్టపోతున్నారన్నారు. మోసపూరితమైన యాప్ లు ఏర్పాటు చేసి ప్రజలను ఆకర్షించి క్రమ క్రమంగా తమ బ్యాంక్ ఖాతాల నుండి డబ్బులను కాజేస్తున్నారని ఈ మధ్య కాలంలో డిజిటల్ అరెస్ట్ లు లాంటివి కూడా ఎక్కువయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో సేర్ప్ సిసి మాణిక్యం, మహిళ మండల సమాఖ్య కార్యదర్శి మాధవి, విఓఎలు అనుచందన, ప్రమీల, లావణ్య, యమున, భావన, సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ కీర్తన, ఎస్ బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ గణేష్, కళాకారులు రాజేందర్, యుగేందర్, పాల్గొన్నారు.

## కొమురమ్మ కుటుంబానికి సిరికొండ పరామర్శ



**గణపురం ,అక్టోబర్ 17 (జనం సాక్షి ):** మండలంలోని అప్పయ్య పల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ పల్లబోయిన సదయ్య తల్లి కొమరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా గురువారం వారి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గణపురం మండలబీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహార లోపాన్ని నివారించాలి

● బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్

**బెల్లంపల్లి, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు సమతుల్య ఆహారం తీసుకొని పోషకాహార లోపాన్ని నివారించాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ బెల్లంపల్లి ఆధ్వర్యంలో తాళ్ల గురిజాల రైతు వేదికలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన సబ్ కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషణ మాసంలో జరుగుతున్న వివిధ కార్యక్రమాల గురుంచి అవగాహన కల్పించారు. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్న పిల్లలు ప్రోటీన్స్, విటమిన్లలతో కూడిన సమతుల ఆహారం



తీసుకోవాలన్నారు. కిశోర బాలికలకు రక్తహీనతపై అవగాహన కల్పించి, ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను సమృద్ధిగా తీసుకోవాలని తెలిపారు. స్త్రీల రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సరైన పోషక ఆహారము తీసుకోవడం, స్థానికంగా లభించే ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు, చిరుధాన్యాలతో చేసిన రాగి జావా, మిల్లెట్స్, మిల్లెట్స్ తో చేసిన ఆహారము తీసుకోవాలన్నారు. రుతుక్రమ సమయంలో తగినంత విశ్రాంతి, పోషకాహారము తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, మెడికల్ ఆఫీసర్ ఇవాంజెలీనా, సీడీపీఓ స్వరూప రాణి, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ రజిత, డీపీఏ శ్యామల, ఉమెన్ హబ్ జిల్లా కోఆర్డినేటర్ సౌజన్య, సూపర్ వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, ప్రీ స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పోషణ మాసం అవగాహన



**పెంచికల్ పేట్ అక్టోబర్ 16 (జనంసాక్షి) :** పోషకాహారం ఆరోగ్య వంతమైన జీవనానికి ఎంతగానో ఉపయోగ పడుతుందని సీడీపీఓ, విజయ లక్ష్మి, అన్నారు. మండలంలోని పెంచికల్ పేట్ అంగన్వాడీ కేంద్రంలో పోషక ఆహార కార్యక్రమాన్ని గురువారం రోజున నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గర్భంలో శిశువు ఎదుగుదల నుంచి,శిశువు జన్మించే వరకు, పెరుగుతున్న పిల్లలకు తగినంత పోషకహారం అందించాలని అన్నారు. బాలికలకు, గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు, పోషకహర లోపాన్ని నివారించుటకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను విడుదల చేస్తున్నాయని ప్రతి ఒక్కరికి వీటిపై అవగాహనా కల్గి ఉండాలని అన్నారు. ఈ సందర్బంగా పిల్లలకు అక్షరాబ్యాసం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ, హేమలత, సూపర్ వైజర్స్,అంగన్వాడీ టీచర్స్, ఆశ కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



## అక్షర వెలుగులు నింపేందుకే ఉల్లాస్

**చిట్యాల, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** వయోజనుల్లో అక్షర వెలుగులు నింపేందుకే ఉల్లాస్ కార్యక్రమం తోడ్పడు నిస్తుందని మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి అన్నారు. ఈ మేరకు గురువారం మానవ వనరుల కేంద్ర చిట్యాల నందు వాలంటరీ టీచర్స్ కు ఉల్లాస్ పుస్తకాల ను పంపిణీ చేశారు. అనంతరం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువు అనేది సమాజంలో మంచి గుర్తింపు ఇస్తుందని తెలిపారు. వయోజనుల్లో అక్షర వెలుగులు నింపేందుకు కృషి చేస్తుందని, మహిళ తన ఇంటిని పిల్లలను సక్రమమైన మార్గంలో ప్రయాణింప చేయడానికి కృషి చేస్తుందని, అందుకే ఇంటికి దీపం ఇల్లాలు అని అన్నారు. మండలంలో వాలంటరీ టీచర్స్ 279 గాను లార్నర్స్ 2790 మందిని గుర్తించామని ఉల్లాస్ కార్యక్రమమును దిగ్విజయం చేయుటకు ప్రతి ఒక్కరు యజ్ఞంలా భావించి పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గుర్రపు రాజేందర్ ,ఉల్లాస్ కార్యక్రమ ఇంచార్జ్ బోనగిరి తిరుపతి, వాలంటరీ టీచర్స్, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

## కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘంలో
# అవినీతి అక్రమాల ఆరోపణలపై విచారణ పూర్తి

**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 16, (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో గత 15 రోజుల నుండి కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘంలో అవినీతి అక్రమాల ఆరోపణలు ఫిర్యాదులు, ప్రత్యారోపణల నేపథ్యంలో



ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఎక్సైజ్ కోపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ దేవేందర్ విచారణ పూర్తి చేశారు .గురువారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలో ని కల్లు గీత పారిశ్రామిక సహకార సొసైటీ కల్లు డిపోలో ఎక్సైజ్ కోపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ దేవేందర్ విచారణ చేశారు .ఫిర్యాదుదారు కోల రాజాగౌడ్ తో పాటు మిగత సొసైటీ సభ్యులను ఆయన విచారించారు .ఈ ఆరోపణలు ఎదుర్కొంటున్న ముకేష్ గౌడ్ విచారణకు హాజరై తమపై అసత్య ఆరోపణలు చేశారని అన్నారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ్ మాట్లాడుతూ... తనపై రాజాగౌడ్ చేసిన ఆరోపణలు అవాస్తవం అని పేర్కొన్నారు.ఆయన మాట్లాడుతున్న ప్రతి అంశం వెనుక రాజకీయ కోణం ఉందని ఆరోపించారు.ఇదే అంశంపై తను కూడా సంఘ సభ్యులతోపాటు కలెక్టర్ కు రిప్రజెంటేషన్ చేయడం జరిగిందని తెలిపారు.ఈ ఆరోపణల వెనుక ఉన్న నిజాలు బయటికి రావాలని పేర్కొన్నారు. ఎవరు తప్పు చేసినా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు .ఎక్సైజ్ కోపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ దేవేందర్ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారు ఆరోపణలకు సంబంధించి అందరూ సంఘ సభ్యులతో విచారణ చేశానని తెలిపారు . తను చేసినవి ఆరోపణలు కావని వాస్తవాలనే ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.నిజా నిజాలను అధికారులే తేల్చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీకి సంబంధించిన సభ్యులందరూ హాజరయ్యారు.

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**జనగామ ప్రతినిధి, అక్టోబర్ 16(జనంసాక్షి):** ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో జనగామ మండలంలో వెంకిర్యాల, గాను పహాడ్, ఎర్ర గొల్ల పహాడ్, ఎర్రకుంటతండా, వడ్లకొండ పెద్ద పహాడ్ గ్రామాలలో పిఎసిఎస్ మరియు ఐకెపి సెంటర్ల ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, జనగామ ,చిటకోడూరు పీఏసీఎస్ చైర్మన్ లు నిమ్మతి మహేందర్ రెడ్డి, చిర్ర శ్రీనివాస్ రెడ్డి, జనగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు నామాల శ్రీనివాస్, పర్ష సిద్దేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ వంగల మల్లారెడ్డి, ఏపీఎం శంకరయ్య, సీఈవో రామ్మోహన్, భాస్కర్ రెడ్డి, ఏఈవో ప్రవళిక, అనిల్,కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ రెడ్డి,



శివరాత్రి కుమార్,జనార్ధన్ రెడ్డి, మిద్దెపక సిద్ధులు,ప్రభాకర్, గాజే అనిల్,జనగామ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రకాశ్ యాదవ్, ముక్కెర యాదగిరి,జడల మల్లేష్, దండెబోయిన ధర్మేందర్, యూత్ కాంగ్రెస్ నాయకులు రఘు గౌడ్,రాజు, అరవింద్ , శ్రీను, వివిధ గ్రామాల నాయకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.



## సెక్యూరిటీ విభాగ ఉద్యోగులతో
# జిఎం సమీక్షా సమావేశం

**శ్రీరాంపూర్ (జనంసాక్షి) :** ఏరియా జిఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ముఖ్య అతిథులుగా ఏరియా జిఎం మునిగంటి శ్రీనివాస్,కార్పొరేట్ సెక్యూరిటీ జిఎం లక్ష్మీనారాయణ పాల్గొనగా సెక్యూరిటీ విభాగ ఉద్యోగులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిఎంలు మాట్లాడుతూ సంస్థ ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ విభాగం పాత్ర ప్రధానమని పేర్కొన్నారు.శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి వ్యాప్తంగా అత్యంత కీలకమైన ప్రాంతమని,సింగరేణి సంస్థ భూములు,ఆస్తులను రక్షించడంలో సెక్యూరిటీ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని,సింగరేణి ప్రాంతాలలో సిసి కెమెరాతో ఎల్లవేళలా పరిశీలిస్తూ, నూతన సాంకేతికతను ఉపయోగించి ముందుకు వెళ్లాలని,సెక్యూరిటీ సిబ్బంది క్రమశిక్షణతో,నిబద్ధతతో విధులు నిర్వహించి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా,డిజిఎం పర్సనల్ ఎస్ అనిల్ కుమార్,ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కా రెడ్డి,పిఒ పి కాంతారావు,ఇన్స్పెక్టర్ రాజన్న,సెక్యూరిటీ విభాగ ఉద్యోగులు, ప్రైవేట్ సెక్యూరిటీ విభాగ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువుకొమ్ము తండా లంబాడీ జేఏసీ కమిటీ ఎన్నిక...



**చెన్నారావుపేట, అక్టోబర్ 16(జనం సాక్షి):** నర్సంపేట డివిజన్ లంబాడి జేఏసీ కన్వీనర్ డాక్టర్ జాటోత్ ఉదయ్ సింగ్, జేఏసీ కో కన్వీనర్ అంగోతు భద్రయ్యల ఆదేశాల మేరకు చెన్నారావుపేట మండల లంబాడి జేఏసీ కన్వీనర్ బోడ మురళి నాయక్ ఆధ్వర్యంలో చెరువుకొమ్ము తండ గ్రామంలో లంబాడి జేఏసీ గ్రామ కమిటీని గురువారం ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా బోడ రవి నాయక్, ఉపాధ్యక్షులుగా వాంకుడోత్ శ్రీను, ప్రధాన కార్యదర్శిగా జరుపుల నర్సు, కార్యదర్శిగా బోడ రెడ్డి, ప్రచార కార్యదర్శిగా బోడ శ్రీనివాస్, కోశాధికారిగా వాంకుడోత్ బాలు, ముఖ్య సలహాదారులుగా భూక్య స్వామి, వాంకుడోత్ కిషన్, బోడ ధంజ్య, లక్ష్మణ్, జగన్, పాల్తియ, శశిందర్, కార్యవర్గ సభ్యులుగా భుక్య వీరు, లచ్చిరం, బోడ శ్రీను, సదర్ లాల్, జరుపుల సుమన్, బోడ వీరస్వామి, బోడ వెంకన్న, భూక్య రమేష్, బోడ శ్రీనివాస్, అజ్మీర దేవా, జరుపుల లాలు, వాలు, లావుడియా భాష, అజ్మీర మోహన్, పిల్లలమరి గణేష్, బోడ రాజేందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బానోత్ విక్రం, బోడ గొప్ప, బోడ కిషన్, సుమన్, ప్రసాద్, రమేష్, రవి, శ్రీను, దంజ్య, తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ పట్టణంలో డ్రైనేజ్ వ్యవస్థ, ప్లాంట్ల ఏర్పాటుపై సమీక్ష

**నిర్మల్ బ్యూరో, అక్టోబర్16, (జనంసాక్షి) :** నిర్మల్ పట్టణంలో ఎస్ టి పి ప్లాంట్ ల ఏర్పాటు, డ్రైనేజ్ వ్యవస్థల పై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి. కలెక్టర్ అభిలాష్ అభినవ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా ఉన్నత అధికారులు, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా ఎస్ టి పి ప్లాంట్ ల ఏర్పాటుకు సంబంధించి మురికి నీరు డ్రైనేజ్ ల ద్వారా చెరువుల్లో కావడం వల్ల చెరువులు కలుషితం అవుతున్న కారణంగా కేంద్రం ఎస్టిపి ప్లాంట్ లను మంజూరు చేసింది. పట్టణంలో ప్రధానమైన జంక్షన్ లలో ఈ ప్లాంట్లను ఏర్పాటు చేసే దిశగా అధికారులకు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి దిశా నిర్దేశం



చేశారు. అనంతరం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కిషోర్ కుమార్,ఆర్ డి ఓ రత్నా కళ్యాణి, జిల్లా ఉన్నత అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మొక్క జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం**

దిలావర్ పూర్ మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంబించారు. రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కనీస మద్దతు ధర క్వింటాల్ కు 2400/- ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు మెడిసెమ్మ రాజు, తాజా మాజీ జడ్పీటీసీ తక్కల రమణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, వీరేష్, మండల అధ్యక్షులు నర్సారెడ్డి, నాయకులు మల్లేష్ తో పాటు మండల నాయకులు కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించడమే లక్ష్యం

● **జిల్లాలో బీసీ జేఏసీ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**

**భూపాలపల్లి, అక్టోబర్ 16 (జనం సాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అన్ని బీసీ కుల సంఘాలు, సామాజిక కార్యకర్తలు , వివిధ రాజకీయ పార్టీల బీసీ ముఖ్య నాయకులు కలిసి భూపాలపల్లి జిల్లా టౌన్ లో జేఏసీ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ముఖ్య ఉద్దేశం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం కోసం అన్ని సంఘాలు అన్ని రాజకీయ పార్టీల బీసీ నాయకులు ఒకే వేదిక మీద ఉండి బీసీలకు రావలసిన 42 శాతం రిజర్వేషన్ రాజ్యాంగపరంగా షెడ్యూల్ 9 లో చేర్చడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తీసుకురావడం కోసం ఒక వేదిక ఏర్పాటు చేశారు. భూపాలపల్లిలో దానికి గాను జిల్లావ్యాప్తంగా అన్ని సంఘాల నుండి చైర్మన్, కన్వీనర్ , కో కన్వీనర్, వైస్ చైర్మన్ పదవులు అందరి సమక్షంలో ఏర్పాటు చేశారు. కమిటీకి చైర్మన్గా పైడిపల్లి రమేష్ ను ఎన్నుకున్నారు. గతంలో తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసే సబ్బండ వర్గాలను ఏకం చేయడంలో ముందున్న



రమేష్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దానికి అన్ని సంఘాలు రాజకీయ పార్టీ నేతలు మద్దత ప్రకటించారు. పార్టీ నాయకులు సంఘ నాయకులు మాట్లాడుతూ ... అందరం ఒకే వేదిక మీద ఉండడంవల్ల తెలంగాణ సాధించుకోగలిగమన్నారు. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించడంలో ప్రభుత్వాల విఫలమయ్యాయని. అందుకు ఈనెల 18న బందుకు పిలుపునిచ్చారు . ఈ బంద్ లో ప్రతీ ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయగలరని కోరారు.. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటి చైర్మెన్ గా పైడిపెల్లి రమేష్ , వర్కింగ్ చైర్మెన్ గట్ల రాజన్న , కన్వీనర్లు అందే భాస్కరా చారి, జోగు బుచ్చన్న , కో కన్వీనర్లు బర్ల గట్టయ్య పటేల్, క్యాతారాజు సాంబమూర్తి, గుమ్మడి ప్రదీప్ పటేల్, మేకల సంపత్ యాదవ్, అమృత అశోక్ క, నలిగేటి సతీష్ యాదవ్, పోతర్ల మల్లికార్జున్, కో ఆర్డినేటర్ శేఖర్ నాని , మహిళా కమిటీ చైర్మెన్ మేకల రజిత, వర్కింగ్ చైర్మెన్ పద్మ , కన్వీనర్ పద్మ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు ,సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

● **ఎమ్మెల్యే జిఎస్ఆర్**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి అంబేద్కర్ స్టేడియంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు హాజరై జ్యోతి ప్రజ్వలన, జెండా ఆవిష్కరన చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కబడ్డీ క్రీడలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలు శారీరక దృఢత్వం మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, సహనాన్ని కూడా పెంపొందిస్తాయని చెప్పారు. క్రీడా రంగంలో ముందుకు సాగేందుకు విద్యార్థులకు తగిన ప్రోత్సాహం, సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ రఘు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోటా రాజబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు : ఎస్సై సూరి



**మంగపేట అక్టోబర్ 16(జనంసాక్షి) :** వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో తరలించకూడదని నిబంధనలను పాటించకుంటే చర్యలు తప్పవని స్థానిక ఎస్సై తిరునగిరి వెంకటరంగయ్య సూరి అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో తరలించకూడదని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. అలాగే దీపావళి సందర్భంగా బాణాసంచా వ్యాపారస్తులు తప్పనిసరిగా అనుమతులను పొందాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని వారు తెలిపారు.

## చిరుధాన్యాలతో పోషక విలువలు

**సిడిపిఓ రాధిక**



**మల్హర్, అక్టోబర్ 16(జనం సాక్షి) :** చిరుధాన్యాలతో పోషక విలువలు పెరుగుతాయని సిడిపిఓ రాధిక అన్నారు. చిరు ధాన్యాల వల్ల శక్తితోపాటు రోగ నిరోధకశక్తి పెరుగుతుందని వారు అన్నారు. బుధవారం భూపాలపల్లి జిల్లా మాలహర్ రావు మండలంలోని కెజీబీవి బాలికల పాఠశాలలో మండల్ లెవల్ పోషన్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల పోషక ఆహారాలైన చిరు ధాన్యాల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గర్భిణీలకు సిమంతం, పిల్లలకు అన్న ప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ భాగ్యలక్ష్మి, కెజీబీవి ఎస్ఓ గంగా భవాని, గంగారాం సెక్టార్ డిఓ వీణా, ఎన్జీవో సమ్మయ్య, పోషన్ అభియాన్ స్వప్న, ఏఎన్ఎం లు, అంగన్వాడీ టీచర్, ఆయాలు, ఆశ వర్కర్లు, గర్భిణులు, తల్లులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంబిబిఎస్ విద్యార్థికి ఆర్థిక సాయం

● **పేదరికం ఉన్నత చదువుకు అడ్డంకి కాదు**

**మంగపేట అక్టోబర్ 16(జనంసాక్షి) :** మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన పూసల కన్నయ్య, స్వరూప దంపతుల కుమారుడు రాంచరణ్ ఇటీవల వెలుబడిన ఎంబిబిఎస్ ఫలితాల్లో సీటును సూర్యాపేటలో సాధించాడు. కానీ ఆ కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక సమస్య వారిని వెంటాడుతుంది. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కుమారుడు రాష్ట్ర యువజన కాంగ్రెస్ సెక్రటరీ కుంజా సూర్య ప్రత్యేక చొరవతో 25 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించగా గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులతో అందజేశారు. అనంతరం పూసల రాంచరణ్ ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్ బాబు, అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా కార్యదర్శి మాసిరెడ్డి వెంకట్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాటబోయిన నర్సింహారావ్, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, బీసీ సెల్ మండల అధ్యక్షులు ముత్తినేని ఆదినారాయణ, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు టీవీ హీదాయతుల్లా, చిన్నపల్లి రాంబాబు, బసారికానీ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## ఆత్మకూరు మహాత్మా జ్యోతిబా ఫూలే పాఠశాలలో వైద్య పరీక్షలు...



**ఆత్మకూరు, అక్టోబర్ 16(జనం సాక్షి):** గురువారం ఆత్మకూరు మండలంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే పెద్దాపూర్ బాలికల పాఠశాలలో ఆత్మకూరు పీహెచ్సీ వైద్య బృందం పాఠశాలకు వచ్చి వైద్య విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్ హెచ్ పి డాక్టర్ పుష్ప లీల,ఎంపీహెస్ సంపత్,రాజ్య లక్ష్మి ఏఎన్ఎం ఎల్లమ్మ ఉమ విద్యార్థులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి,అనారోగ్యంగా ఉన్నవారికి తగిన మందులు అందచేసి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచిస్తూ దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు.అదేవిధంగా ఆకస్మాత్తుగా స్పృహ కోల్పోయిన వారికి సిపిర్ ను ఎలా చేయాలో విద్యార్థుల పట్ల ప్రత్యక్షంగా చేసి చూపించారు.అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

# జిల్లా కోర్టులో సిపిఆర్పై అవగాహన

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ**



**మహబూబాబాద్ బ్యూరో, అక్టోబర్ 16(జనం సాక్షి):** ఆరోగ్యమే మహాభాగ్యమని అందుకు సిపిఆర్ పద్ధతి ఒక ముఖ్యమైన ప్రక్రియ అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నటువంటి వ్యక్తికి పునర్జన్మ నిచ్చు విధానమే ఈ సిపిఆర్ పద్ధతి అని, ఈ విధానంపై న్యాయశాఖ ఉద్యోగులలో అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యం అభినందనీయమని, అందుకు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల మహబూబాబాద్ వారి సౌజన్యంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మహబూబాబాద్ వారు జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అన్నారు. ఈ పద్ధతిలో ఆగిపోయి లయతప్పిన గుండెను తిరిగి పని చేయించుటకు అవలంబిస్తున్న ఈ పద్ధతి అద్భుతమైనదని, ఈ విధానంలో అనేకమందికి ఆగిపోయిన గుండెను తిరిగి గాడిలో పెట్టడం గురించి మనం వింటున్నామని, ఈ విధానంపై న్యాయశాఖ ఉద్యోగులు, న్యాయవాదులు, కోర్టు డ్యూటీ కానిస్టేబుల్స్కు ప్రత్యక్ష పద్ధతిలో అవగాహన కల్పించడం మహాభాగ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ శాలిని, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ స్వాతి మురారి, అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ కృష్ణ తేజ్ జిల్లా కోర్టు పరిపాలనాధికారి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

## గూడ్స్ వాహనాల్లో అధికం గా ప్రయాణించరాదు

**ఎస్ఐ చల్ల రాజు**



**ములుగు/ వెంకటాపూర్, అక్టోబర్16(జనం సాక్షి):** వెంకటాపూర్ మండలం లో గురువారం రోజున గూడ్స్ మరియు ఇతర వాహనదారులకు జవహర్ నగర్ వద్ద ఎస్ఐ చల్ల రాజు ఆధ్వర్యం లో అవగాహన కార్యక్రమం ను నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా ప్రయాణికులు ఎవరు కూడా గూడ్స్ వాహనాల్లో ప్రయాణించరాదని అదేవిధంగా వాహనాలలో పరిమితికి మించిన వాహనదారులను, ప్యాసింజర్లను అలో చేయవద్దని,అదేవిధంగా వాహన ఓనర్లు ఎవరైతే ఉన్నారో వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను దగ్గర ఉంచుకోవాలని,తగిన జాగ్రత్తలను పాటించవలసిందిగా చెప్పటం జరిగింది.ఒకవేళ ఎవరైనా పై నిబంధనలు పాటించక పోతే కఠిన చర్యలు తీసుకోబడుతుందని వెంకటాపూర్ ఎస్ఐ చల్ల రాజు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరం



**నూగూర్ వెంకటాపురం అక్టోబర్ 16(జనం సాక్షి) :** ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని మాతా శిశు వు సంరక్షణ వైద్యాధికారి భాస్కర్ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామాలలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పించారు. గర్భవతులు, బాలింతలకు, వైద్య పరీక్షలు నిర్వహించి మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధిగ్రస్తులకు నెలవారి మందులు పంపిణీ చేశారు. బాలింతలకు తల్లులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈ ఓ కోటిరెడ్డి, ఏఎన్ఎం స్వప్న, హెల్త్ అసిస్టెంట్ రాఘవులు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.